సాక్షి తూర్పుగోదావరి

సోమవారం ॥ 7 ॥ అక్టోబర్ ॥ 2024



టమోటా.. ఉల్లికిపాట్లు

ఉల్లిని కోయకుండానే కన్నీరు వస్తోంది.. టమాటా ధర చూస్తే బెంబేలెత్తిస్తోంది.. రోజు రోజుకూ ఉల్లి, టమాటా ధర కొండెక్కుతోంది.




అన్న చేతిలో తమ్ముడి హతం

ఆస్తి తగాదాల నేపథ్యంలో అన్న చేతిలో తమ్ముడు హతమైన ఘటన పి.మల్లవరం గ్రామంలో కలకలం రేపింది.

8 లో

1.62 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి ఆదివారం సాయంత్రం 1.62.276 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 10.90 అడుగులకు నీటిమట్టం చేరింది. డెల్టా కాలువలకు 14 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

న్యూస్‌రీల్

మహాలక్ష్మీ నమోస్తుతే



రాజమహేంద్రవరం దేవీచౌక్ మహాలక్ష్మీ దేవి అలంకారంలో అమ్మవారు

సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): దసరా మహోత్సవాలలో భాగంగా మహాలక్ష్మీ దేవి అలంకారంలో దుర్గమ్మ దర్శనమిచ్చారు. ఆదివారం నాలుగో రోజు రాజమహేంద్రవరంలోని దేవీచౌక్‌లోని అమ్మవారు మహాలక్ష్మీ దేవి అలంకారంలో దర్శనం ఇవ్వడంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీమహాలక్ష్మి అలంకారంలో అమ్మవారిని దర్శించుకోవడం వల్ల ఐశ్వర్యప్రాప్తి, విజయం లభిస్తుందని భక్తుల విశ్వాసం. ఉదయం నుంచే భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారి దర్శనానికి తరలివచ్చి కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని బాదం, సన్‌ఫ్లవర్ గింజలతో అలంకరించారు.



నల్లజర్ల మండలం సుభద్రపాలెం వద్ద అక్రమంగా తరలుతున్న ఇసుకను అడ్డుకున్న గ్రామస్తులు

పెండ్యాల ర్యాంపులో నిండుకున్న ఇసుక నిల్వలు

నిశి వేళ మస్కా!

- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- కాతేరు, వెంకటనగరంలలో తవ్వకాలు
- బ్లాక్ మార్కెట్‌లో 18 టన్నుల ఇసుక లారీ రూ.20 వేల నుంచి రూ.30 వేలకు విక్రయం
- జిల్లాలో ఇసుక కొరత తీవ్రం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

సాక్షి, రాజమహేంద్రవరం: ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. ఇసుక కొరతను ఆసరాగా చేసుకుంటున్నారు. ఇదే అదునుగా భావించి రవాణా దారులు పెట్రేగిపోతున్నారు. యథేచ్ఛగా అక్రమార్కులు తెగబడుతున్నారు. ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. అక్రమ తరలింపునకు అర్రులు చాస్తున్నారు. రాత్రిళ్లు గుట్టుచప్పుడు కాకుండా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. విషయం తెలిసినా అధికారులు, పోలీసులు మామూళ్ల మత్తులో అధికార పార్టీ నేతలు, అక్రమార్కుల అడుగులకు మడుగులొత్తుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చూసీచూడనట్లు వ్యవహరిస్తుంటడంలో రూ.కోట్ల విలువ చేసే ఇసుకల లారీలు, ట్రాక్టర్లలో జిల్లా సరిహద్దులు దాటేస్తోంది. గ్రామస్తులెవరైనా పోలీసులకు సమాచారం ఇచ్చి పట్టుబడితే.. నామమాత్రంగా జరిమానా విధించి వదిలేస్తుండటంతో అక్రమ దందాకు అడ్డూ అదుపు లేకుండా పోతోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రాత్రి సమయాల్లో తరలింపు

తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ కాతేరు, వెంకటనగరం, కోటిలింగాల, గాయత్రి ర్యాంపుల నుంచి ప్రతి రోజూ వందల లారీలలో ఇసుకను రాత్రి సమయాల్లో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా సమాచారం. టీడీపీ ఎమ్మెల్యే, కీలక నేతల కనుసన్నల్లో ఈ అక్రమ దందా సాగుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఇసుక తరలించే ప్రాంతాల్లో ఎవరూ అటువైపు సంచరించకుండా, అటువైపు చూడకుండా అక్రమార్కులు అడ్డుకట్ట వేస్తున్నారు. రోడ్లలో ప్రైవేటు వ్యక్తులతో రాత్రింబవళ్లు రెక్కీ నిర్వహిస్తున్నారు.

ద్విచక్ర, కార్లలో కాపు కాస్తున్నారు. ఎవరైనా అనుమానంగా తారసపడితే నిలువరిస్తున్నారు. వారిని ప్రశ్నిస్తున్నారు. నిఘా ఉన్నది అధికారి అని తెలిస్తే సదరు ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలతో అధికారులకు ఫోన్లు చేయిస్తున్నారు. చేసేది లేక అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడలేని పరిస్థితి నెలకొంది. సామన్య ప్రజలు ఎవరైనా వెళితే.. ఇక్కడ ఏం పనంటూ దాడులకు సైతం వెనకాడటం లేదంటే.. ఇసుక దందా ఏ స్థాయిలో జరుగుతోందో అర్థం అవుతోంది. అక్రమంగా తరలుతున్న ఇసుకను 18 టన్నుల లారీ రూ.30 వేల నుంచి రూ.35 వేలకు విక్రయిస్తున్నారు. దూరాన్ని బట్టి ధర సైతం పెరుగుతోంది.

రూ.24 లక్షల అపరాధ రుసుం వసూలు

తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా అక్రమంగా ఇసుక తరలిస్తూ పట్టుబడిన అక్రమార్కుల నుంచి ఇప్పటి వరకు రూ.24 లక్షల మేరకు అపరాధ రుసుము వసూలు చేసినట్లు జిల్లా అధికారులు చెప్తున్నారు. దీన్ని బట్టి చూస్తే ఇసుక అక్రమ రవాణా ఏ స్థాయిలో జరుగుతోందో అర్థం అవుతోంది.

ర్యాంపుల్లో నిల్వలు నిల్

తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఇసుక కొరత వేధిస్తోంది. పెండ్యాల, పందలపర్రు ర్యాంపుల్లో 34 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంచామని అధికారులు వెల్లడిస్తున్నారు. అది కూడా ప్రభుత్వ అవసరాలకు మాత్రమే వినియోగిస్తున్నారు. ఈ రెండు ర్యాంపులు మినహా జిల్లాలో మరెక్కడా ఇసుక నిల్వలు ఉన్న దాఖలాలు లేవు. ఈనెల 15వ తేదీ నుంచి అందుబాటులో ఉంచుతామని అధికారులు వెల్లడిస్తున్నారు. ఇదిలా రెండు ర్యాంపుల నుంచి 3 జిల్లాలకు ఇసుక సరఫరా చేస్తున్నారు. గోదావరి ఇసుక కోసం ఆర్డర్లు పోటెత్తుతున్నాయి. తూర్పుగోదావరి జిల్లాతో పాటు ఉమ్మడి పశ్చిమగోదావరి, కాకినాడ, కోనసీమ, విజయవాడ తదితర జిల్లాల నుంచి బుకింగ్స్ వస్తున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. చివరకు రాయలసీమ ప్రాంతం కర్నూలు నుంచి సైతం ఆర్డర్లు వస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం వీటన్నింటికీ ఈ రెండు ర్యాంపులే దిక్కయ్యాయి. వెరసి జిల్లా ప్రజలకు ఇసుక అందడం లేదు. ఆన్‌లైన్ బుకింగ్ విధానంలో సాంకేతిక అవగాహన ఉన్న వారు వెంటనే బుక్ చేసేస్తున్నారు. దీంతో పాటు బల్క్ బుకింగ్ ద్వారా ఇసుక తరలిపోతోంది. ప్రైవేటు గృహనిర్మాణ సంస్థలు ఎక్కువ శాతం ఇసుకను పట్టుకుపోతున్నారు. దీంతో సామాన్యులు బ్లాక్ మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది.

రూ.120 కోట్ల ఇసుక హాంఫట్!

టీడీపీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో టీడీపీ నేతలు, అనుచరులు కలిసి జిల్లా వ్యాప్తంగా రూ.120 కోట్లకు పైగా విలువ చేసే ఇసుక దోచేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతకు ముందు ప్రభుత్వం నిల్వ ఉంచిన ఇసుక గుట్టలను ఎమ్మెల్యే, వారి అనుచరులు కొల్లగొట్టేశారు. ప్రస్తుతం గోదావరి వరదల నేపథ్యంలో ఇసుక తీతకు విరామం ప్రకటించారు. అయినా పట్టించుకోకుండా రాత్రిళ్లు గుట్టుచప్పుడు కాకుండా తీసేసి నిల్వలు ఉంచుతూ బ్లాక్ మార్కెట్‌కు తరలించి రూ.లక్షలు కొల్లగొట్టేస్తున్నారు.

మొక్కుబడి తనిఖీలు

ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లను పోలీసులు మొక్కుబడిగా పట్టుకుంటున్నారు. వాటికి తహసీల్దార్ కోర్టులో పెనాల్టీ వేయించి వదిలేస్తున్నారు. దీన్ని అసరాగా చేసుకున్న అక్రమార్కులు పట్టుకోవడం షరా మామూలే అన్న చందంగా మరింతగా బరితెగిస్తున్నారు. నిబంధనల మేరకు ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టరు మూడు సార్లుకు మించి పట్టుబడితే ఆ ట్రాక్టర్‌ను కోర్టుకు సైతం హాజరు పర్చే అవకాశం చట్టప్రకారం ఉన్నా.. పోలీసులు ఆ దిశగా దృష్టి సారించడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటి వరకు కోర్టుకు హాజరు పర్చిన దాఖలాలు మచ్చుకైనా కనపడవు.

బోట్‌మెన్ సొసైటీల ఎంపికపై గందరగోళం

జిల్లాలో గోదావరి ఇసుక తీతలో బోట్‌మెన్ సొసైటీలది కీలక పాత్ర. ఇసుక తీతకు 230 బోట్‌మెన్ సొసైటీలు దరఖాస్తు చేసుకున్నాయి. ఇందులో నిబంధనలకు అనుగుణంగా ఉన్న 48 సొసైటీలకు ఇసుక తీసుకునేందుకు అనుమతులు మంజూరు చేశారు. మిగిలిన 182 సొసైటీలకు నిబంధనలు పరిశీలించి అనుమతులు ఇవ్వనున్నట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. సొసైటీల్లో బోగస్ సొసైటీలు, బినామీ పేర్లతో ఏర్పడిన సొసైటీలు ఎక్కువగా ఉన్నాయన్న వాదన కూడా వినిపిస్తోంది. ఈ ఆరోపణల నేపథ్యంలో అనుమతులు ఆపినట్లు తెలిసింది.

మద్యం దుకాణాలకు 425 దరఖాస్తులు

ఎక్సైజ్ సూపరింటెండెంట్ లావణ్య



రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు కేవలం మూడు రోజులే గడువు ఉందని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ చింతాడ లావణ్య అన్నారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో 125 మద్యం దుకాణాలకు సంబంధించి ఇప్పటి వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా 425 దరఖాస్తులు వచ్చాయన్నారు. నూతన మద్యం పాలసీ ప్రకారం రూ.2 లక్షలతో ఎవరైనా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆఫ్‌లైన్ ద్వారా రాజమహేంద్రవరం సౌత్, రాజమహేంద్రవరం నార్త్, కోరుకొండ, రంగంపేట, కొవ్వూరు, దేవరపల్లి, నిడదవోలు ఎక్సైజ్ స్టేషన్‌లలో దరఖాస్తులు అందజేయవచ్చన్నారు. ఈ నెల 9వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. ఈ నెల 11వ తేదీ రాజమహేంద్రవరం ఆనం కళాకేంద్రంలో కలెక్టర్ సమక్షంలో లాటరీ తీయనున్నట్లు తెలిపారు. 12వ తేదీన మద్యం దుకాణాలు కేటాయిస్తారన్నారు.

మా బిడ్డల భద్రతకు భరోసా ఏదీ?

- అపహరిస్తే స్పందన లేదు..
- హత్య జరిగినా చలనం లేదు
- అశ్వియా అంజుమ్ హంతకులను ఉరి తీయాలి
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి మొహమ్మద్ ఆరిఫ్



సీటీఆర్‌ఐ (రాజమహేంద్రవరం): రాష్ట్రంలో శాంతిభద్రతల తీరు ఎంత నిర్లక్ష్యంగా ఉందో తెలిపేందుకు ఏడేళ్ల చిన్నారి అశ్వియా అంజుమ్ అపహరణ, హత్య ఒక ప్రత్యక్ష ఉదాహరణ అని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మొహమ్మద్ ఆరిఫ్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక జాంపేటలోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ అపహరణ జరిగిన మూడు రోజుల వరకు బాలిక ఆచూకీ కనుగొనలేకపోయారని, హత్య జరిగి మృతదేహం దొరికి నాలుగు రోజులు గడిచినా హంతకుల జాడ తెలుసుకోలేకపోవడంపై రాష్ట్రంలోని చిన్నారుల తల్లిదండ్రులు తమ పిల్లల భద్రత పట్ల తీవ్రమైన ఆందోళనలో ఉన్నారని అన్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి సొంత జిల్లాలో ఇటువంటి సంఘటన జరగడం, ఉప ముఖ్యమంత్రి జిల్లాలోనే ఉండి కూడా ఈ ఉదంతంపై స్పందించకపోవడం బాలిక తల్లిదండ్రులను, రాష్ట్ర ముస్లిం సమాజాన్ని తీవ్రంగా కలిచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితి ఇంత ఆందోళనకరంగా ఉన్నా దర్యాప్తు వేగవంతం కాకపోవడం ప్రభుత్వ, పోలీసు శాఖల వైఫల్యం కాదా అని ప్రశ్నించారు. 31 వేల మంది ఆడపిల్లలు మిస్సయ్యారన్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన కళ్ల ముందు ఇంత జరుగుతున్నా ఎందుకు ప్రకటన చేయడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికే మీ తీరువల్ల మైనార్టీలు తీవ్ర అభద్రతాభావానికి గురవుతున్నారని, వారి భయాన్ని నిజం చేసేలా కూటమి ప్రభుత్వం ఉందని దుయ్యబట్టారు. దర్యాప్తు జరిగిన తీరుపై అనేక అనుమానాలున్నాయని, రాష్ట్ర హోం మంత్రి, డీజీపీ తక్షణమే స్పందించి నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని, బాలిక కుటుంబానికి రక్షణ కల్పించి వారికి మనోధైర్యాన్ని ఇవ్వాలని, లేని పక్షంలో ఈ కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు.

డివిజన్‌లో 126 ధాన్యం కొనుగోలు కేంద్రాలు

జేసీ చిన్నరాముడు



కాపవరం రైతు సేవా కేంద్రంలో జేసీ చిన్నరాముడు, ఇతర అధికారులు

కొవ్వూరు: ఈ ఏడాది ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు కొవ్వూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో త్వరలో 126 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు ప్రకటించారు. డివిజన్ పరిధిలోని రైస్ మిల్లర్లతో ఆదివారం ఆయన స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సమావేశమయ్యారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం దిగుబడి గణనీయంగా వస్తుందని అంచనా వేస్తున్నామని ఆయన అన్నారు. ధాన్యం విక్రయాల్లో లోగడ రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులను మిల్లర్లతో చర్చించి, అవి పునరావృతం కాకుండా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. మిల్లర్లు, రైతులు, వ్యవసాయశాఖ అధికారుల సమన్వయంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని జేసీ అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ ఈ ఖరీఫ్‌లో రైతులు 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని పండిస్తున్నారన్నారు. దీనిలో సన్న బియ్యాన్ని ఎగుమతి చేయగా, 2.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఈ సీజన్‌లో సేకరించాల్సి ఉందన్నారు. ధాన్యం సేకరణలో సమస్యలను అధిగమించేందుకు సమన్వయ శాఖల అధికారులు, మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఎం.నాగాంజనేయులు మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన గోనె సంచెలను సిద్ధం చేస్తామన్నారు. రైతు సేవా కేంద్రాల వారీగా పంట దిగుబడి అంచనా వేసి అందుకు అనుగుణంగా గోనె సంచులు సరఫరా చేస్తామన్నారు. ఆర్డీవో రాణి సుస్మిత మాట్లాడుతూ ధాన్యం విక్రయాల్లో ఏదైనా సమస్యలుంటే తక్షణం అధికారుల దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. రెవెన్యూ డివిజన్ కేంద్రంలో రైతుల సమస్యలు తెలుసుకునేందుకు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయిస్తామన్నారు. అలాగే రైతు సేవా కేంద్రాల వద్ద ధాన్యం కొనుగోలు నియమ నిబంధనలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయించనున్నట్లు ప్రకటించారు. అంతకు ముందు కొవ్వూరు మండలం కాపవరంలో రైతు సేవా కేంద్రాన్ని జేసీ, ఇతర అధికారులు సందర్శించారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై గ్రామ వ్యవసాయ సహాయకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పౌర సరఫరాల మేనేజర్ టి.రాధిక, ఇన్‌చార్జి డీఎస్‌వో ఎం.నాగాంజనేయులు, వ్యవసాయ శాఖ ఏడీ పి. చంద్రశేఖర్, మండల వ్యవసాయ శాఖ అధికారులు, రైస్ మిల్లర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కర్మ ఫలితమే ఈ జన్మ

- శ్రీపీఠం స్వామీజీ పరిపూర్ణానంద
- నాలుగో రోజుకు చేరిన మహాశక్తి యాగం
- కుంకుమార్చనలో పాల్గొన్న వేలాది మంది మహిళలు



భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేస్తున్న పరిపూర్ణానంద స్వామి

కాకినాడ రూరల్: ప్రతి ఒక్కరూ కర్మను బట్టే భూమి మీదకు వస్తారని, కర్మకు తగ్గ ఫలితం ప్రకృతి ఇస్తుందని పరిపూర్ణానంద స్వామి పేర్కొన్నారు. స్థానిక రమణయ్యపేట శ్రీపీఠంలో దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా నిర్వహిస్తున్న మహాశక్తి యాగం నాలుగో రోజు లలితా కుంకుమార్చనలకు హాజరైన వేలాది మంది భక్తులను ఉద్దేశించి స్వామిజీ ప్రసంగించారు. కర్మ అనేది ప్రధానమైనదన్నారు. నోరు ఉందని అవతలి వారిని ఆడిపారేసుకున్నా, ఇంకొకరిని బాధపెట్టి బతకడమనేది మనం పట్టుకువెళ్లే దానిలో పెద్ద కర్మ అన్నారు. 80 ఏళ్ల వృద్ధులు సైతం పూజలో పాల్గొంటున్నారంటే అమ్మవారిపై విశ్వాసమే కారణమన్నారు. సాయంత్రం ఐశ్వర్యాంబిక అమ్మవారు భక్తులకు వారాహి దేవిగా భక్తులు దర్శనమిచ్చారు. లలితా పరాదేవి ఆజ్ఞతో విసుక్రుడు అనే రాక్షసుడిని హరించేందుకు వారాహి అమ్మవారు అవతరించారన్నారు. దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా అర్గళ, కీలక, వారాహి వంటి విశేష హోమాలతో పాటు సాయంత్రం మహిళలకు సౌభాగ్య ప్రాప్తి కోరుతూ సౌభాగ్య పూజను నిర్వహించారు. రోజూ 30 వేల మందికి పైబడి వస్తున్న భక్తులు మధ్యాహ్నం ఉచిత భోజన సదుపాయాన్ని దాతల సహకారంతో పరిపూర్ణనంద స్వామి ఏర్పాటు చేశారు.



దీక్షా వస్త్రాలతో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

పారదర్శకంగా ఇసుక సరఫరా

- టన్ను ఇసుక రూ.345
- 16 నుంచి అందుబాటులోకి
- జిల్లాలో 9 చోట్ల తవ్వకాలు
- అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు
- కలెక్టర్ ప్రశాంతి వెల్లడి

సాక్షి, రాజమహేంద్రవరం: దరఖాస్తుదారులకు ఇసుకను పారదర్శకంగా అందించేందుకు కృషి చేస్తున్నట్టు కలెక్టర్ పి.ప్రశాంతి వెల్లడించారు. మెట్రిక్ టన్ను ఇసుక రూ.345 రూపాయలుగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నెల 16వ తేదీ నుంచి వినియోగదారులకు ఇసుక అందుబాటులోకి తీసుకురానున్నట్లు స్పష్టం చేశారు. ఇసుక లభ్యతపై క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా తొమ్మిది కేంద్రాల్లో బోట్స్‌మన్ సొసైటీల ద్వారా ఇసుక తవ్వకాలు ప్రారంభించినట్లు చెప్పారు. పెండ్యాల, పందలపర్రు ర్యాంపుల్లో 34 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు. ఇసుక లభ్యతను బట్టి నిత్యం నాలుగు జిల్లాలకు సరఫరా చేస్తున్నామన్నారు. సోమవారం నుంచి వారం రోజుల కోసం 65 వేల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. నిత్యం సగటున 15 వేల మెట్రిక్ టన్నుల ఇసుక ఆన్‌లైన్‌లో దరఖాస్తుదారుల కోసం సిద్ధంగా ఉందన్నారు. ఓపెన్ స్టాక్ యార్డ్ పాయింట్లు అందుబాటులోకి రావడం వల్ల త్వరలో ధర మరింతగా తగ్గి టన్ను ఇసుక రూ.215కు అందుబాటులోకి వస్తుందన్నారు. మరిన్ని ఓపెన్ రీచ్‌లు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. ప్రస్తుతం 48 బోట్స్ మ్యాన్ సొసైటీలకు అనుమతి ఇచ్చామని, రానున్న రోజుల్లో అర్హత మేరకు మరికొన్ని సొసైటీలకు అనుమతులు జారీ చేయనున్నట్లు వెల్లడించారు.

ఓపెన్ స్టాక్ పాయింట్లకు టెండర్లు

జిల్లాలో అక్టోబర్ 16 నుంచి ప్రారంభించనున్న 17 ఓపెన్ స్టాక్ పాయింట్లకు త్వరలో టెండర్ల ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసిన వ్యక్తిగత, బల్క్ ఆర్డర్లకు 24 గంటల నుంచి 48 గంటల్లో ఇసుక సరఫరా చేస్తున్నామన్నారు. ప్రతి సచివాలయం, మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసిన 48 గంటల వ్యవధిలోనే వినియోగదారులకు ఇసుకను అందజేస్తున్నామన్నారు. ప్రతి వాహనానికి జియో ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇసుక సరఫరాపై మార్చి 2025 వరకు భవిష్యత్తు కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. 10 ఓపెన్ సాండ్ రీచ్‌ల (సెమీ మెకానైజ్డ్) ద్వారా 58 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను అందుబాటులో ఉండేలా, పట్టా భూముల్లో తవ్వకాల కోసం ఉత్తర్వులు జారీ చేశామన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 144 బల్క్ ఆర్డర్లు వచ్చాయని, 38 ఆర్డర్లకు సంబంధించి 9,347 మెట్రిక్ టన్నుల ఇసుకను సరఫరా చేసినట్లు చెప్పారు. సమావేశంలో జేసీ ఎస్.చిన్నరాముడు, ఏఎస్పీ ఏవీ సుబ్బరాజు, మైన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ డి.ఫణి భూషణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రశాంతంగా టెట్



టెట్ కేంద్రం వద్ద జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి వాసుదేవరావు, డిపార్ట్‌మెంట్ అధికారులు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ఉపాధ్యాయ అర్హత పరీక్ష మూడో రోజు ప్రశాంతంగా జరిగిందని జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కె.వాసుదేవ రావు తెలిపారు. పేపర్‌మిల్ సమీపంలోని రాజీవ్ గాంధీ విద్యా సంస్థలోని ఇయాన్ డిజిటల్ జోన్‌లో ఆదివారం ఉదయం సెషన్-1 లో పేపర్-1ఎ ఎస్‌జీటీ పరీక్ష జరిగినట్టు వాసుదేవరావు తెలిపారు. 959 మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 820 మంది పరీక్షకు హాజరుకాగా 139 మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. సెషన్ -2 లో పేపర్-2 బి ఎస్‌జీటీ పరీక్షకు 36 మందికి 34 మంది హాజరయ్యారని, ఇద్దరు గైర్హాజరయ్యారన్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌లుగా అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, హెచ్‌ఎంలు కోలా సత్యనారాయణ, గణపతి వ్యవహరిస్తున్నారు.

పొగాకు నాట్లకు రైతులు సన్నద్ధం



గోపాలపురం మండలం పెద్దాపురంలో సిద్ధమైన పొగాకు నారుమడులు

గోపాలపురం: మెట్ట ప్రాంతంలో ప్రధాన వాణిజ్య పంట అయిన వర్జీనియా పొగాకు తోటలు వేయడానికి రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే పొగాకు నారుమడులు సిద్ధం చేసి సుమారు 40 రోజులు కావస్తోంది. మరో పది రోజుల్లో నాట్లు వేయడానికి రైతులు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాది పొగాకు కొనుగోళ్లు ఆశాజనకంగా ఉండడంతో రైతులు తమ పొలాల్లో ఉన్న జామాయిల్, జీడిమామిడి, మామిడి తోటలను తొలగించి పొగాకు నాట్లు వేయడానికి సన్నద్ధం చేస్తున్నారు. దీంతో పొగాకు క్యూరింగ్ బ్యారన్లకు డిమాండ్ పెరిగింది. బ్యారన్ ఒక్కంటికి రూ 2.50 లక్షల, ఎకరం పొలం రూ.65 వేల నుంచి రూ.70 వేలు పెట్టి మరీ రైతులు కౌలుకు తీసుకుని పొగాకు సాగు చేస్తున్నారు. ఈ ఏడాది కిలో పొగాకు అత్యధికంగా రూ.400 పైన పలకడంతో రైతులు వర్జీనియా పొగాకు సాగుపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు.

క్లుప్తంగా

సముద్ర స్నానానికి వెళ్లి యువకుడి మృతి



చంటి మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లిదండ్రులు



చంటి (ఫైల్)

తొండంగి: మండలంలోని వేమవరం పంచాయతీ పంపాదిపేట సముద్ర తీరంలో స్నానానికి వెళ్లి కెరటాల ఉధృతికి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. తుని మండలం రాజుపేట గ్రామానికి చెందిన ఉరుకూటి చంటి (24) టైలర్‌గా జీవనం సాగించేవాడు. సోమవారం భవానీ మాల వేసేందుకు నిర్ణయించుకుని ఆదివారం సాయంత్రం వేమవరంలోని పంపాదిపేట సముద్ర తీరానికి సహచరులతో వెళ్లాడు. సముద్రంలో స్నానానికి దిగి కెరటాల ఉధృతికి మునిగిపోయాడు. వెంటనే సహచరులు అక్కడ ఉన్న మత్స్యకారులకు తెలపడంతో సముద్రంలోకి వెళ్లి చంటిని బయటకు తీశారు. అపస్మారక స్థితిలో ఉన్న అతన్ని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. ఈ ఘటనతో మృతుడి తల్లిదండ్రులు రమణమ్మ, గోవిందు ఇతర కుటుంబ సభ్యులంతా కన్నీరు మున్నీరుగా విలపించారు. దీనిపై ఎటువంటి సమాచారం అందలేదని తొండంగి పోలీసులు తెలిపారు.

టమోటా.. ఉల్లికిపాట్లు

- ఉల్లి రూ.80, టమాటా రూ.90
- సెంచరీ దిశగా దూసుకెళ్తున్న ధరలు
- అల్లాడుతున్న వినియోగదారులు

అలమూరు: ఉల్లిని కోయకుండానే కన్నీరు వస్తోంది.. టమాటా ధర చూస్తే బెంబేలెత్తిస్తోంది.. రోజు రోజుకూ ఉల్లి, టమాటా ధర కొండెక్కుతోంది. ఈ ధర సెంచరీ దిశగా దూసుకెళ్తోంది. సగటు జీవి మార్కెట్ వెళ్లి ఏమీ కొనలేని పరిస్థితి దాపురించింది. ప్రభుత్వం స్పందించి వీటిని రాయితీపై అందించాలనే డిమాండ్ సర్వత్రా వ్యక్తమవుతోంది. మూడు నెలల నుంచి ఉల్లి కిలో రూ.50 పైబడే ఉంది. ఉల్లిని ఎక్కువగా పండించే కర్నూలు జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు పంట తీవ్రంగా దెబ్బ తింది. దీంతో ఉల్లిని అధికంగా పండించే మహారాష్ట్రపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు చెందిన హోల్ సేల్ ఉల్లి వ్యాపారులు పూర్తిగా దిగుబడులపైనే ఆధారపడాల్సి రావడంతో ఉల్లి ధరలు సుమారు 70 శాతం మేర పెరిగాయి. ప్రధానంగా రాజమహేంద్రవరం, మడికి, రావులపాలెం, చొప్పెల్ల తదితర హోల్‌సేల్ మార్కెట్లలో ఉల్లి దిగుమతులు అంతంత మాత్రంగానే ఉండటంతో ధరల పెరుగుదలకు కారణమైందని వ్యాపారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో రోజుకు సుమారు దాదాపు వెయ్యి టన్నుల ఉల్లిపాయల అవసరం అవుతుంది. గతంలో దాదాపు 40 లారీల్లో సుమారు 900 టన్నుల వరకూ సరఫరా జరిగేది. ప్రస్తుతం ఉల్లి సాగు రాష్ట్రంలో అందుబాటులో లేక హోల్‌సేల్ వ్యాపారులు పూర్తిగా దిగుబడులపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉల్లి సరఫరా కాగా, ప్రస్తుతం రోజుకు 500 టన్నులకే పరిమితమైంది. ఉమ్మడి జిల్లాలో దిగుమతి చేసుకునే ఆయా ప్రాంతాల్లో వ్యాపారుల వద్ద ఉల్లి నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయి. బహిరంగ మార్కెట్‌లో ఉల్లిపాయలకు డిమాండ్, సరఫరాకు తీవ్ర వ్యత్యాసం ఏర్పడి ధరలు పెరుగుతూ వస్తున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఏప్రిల్‌లో రిటైల్ మార్కెట్‌లో రూ.25 ఉన్న నాణ్యమైన ఉల్లి ధర ప్రస్తుతం రూ.80కు చేరింది. చిరు వ్యాపారులు ఆటోలపై ఇళ్ల వద్దకు వచ్చి కొంచెం నాసిరకంగా ఉన్న రెండు కిలోల కొత్త ఉల్లిపాయలు రూ. 100కు విక్రయిస్తున్నారు.





టమాటా.. అదే బాట

రాష్ట్రంలో టమాటా విరివిగా పండే చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట తీవ్రంగా దెబ్బతింది. ఉమ్మడి జిల్లా వ్యాపారులు టమాటాను కర్ణాటకలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రస్తుతం దిగుమతి చేసుకుంటున్నారు. రాజమహేంద్రవరం, రావులపాలెం, మడికి తదితర అంతర్రాష్ట్ర హోల్‌సేల్ మార్కెట్‌లో 24 కిలోల బరువు ఉంటే టమాటా బాక్సు ధర నాణ్యతను బట్టి ప్రస్తుతం రూ.1,700 నుంచి రూ.2,100 వరకూ పలుకుతుంది. కర్ణాటక వ్యాప్తంగా టమోటా పంట ఇప్పుడిప్పుడే అందుబాటులోకి రావడంతో ప్రస్తుతం సరఫరా పరిమితంగా ఉంది. గతంలో రాజమహేంద్రవరం, రావులపాలెం, మడికి జాతీయ మార్కెట్‌లో సుమారు వంద టన్నుల వ్యాపారం జరిగే టమాటా నేడు కేవలం 40 టన్నులకే పరిమితమైంది. నాసిరకం, కుళ్లిన టమోటాను తీసివేసి హమాలీ, రవాణా చార్జీలు కలుపుకోగా కూరగాయల వ్యాపారికి కిలో ధర రూ.70కు చేరుకుంటుంది. వ్యాపారులు తమ వద్దకు వచ్చే వినియోగదారులకు బహిరంగ మార్కెట్‌లో రూ.90 వరకూ విక్రయిస్తున్నారు. ఈ ఏడాది జూన్ నెలలో కోత కూలీ రాని టమోటా ప్రస్తుతం సెంచరీ వైపుగా దూసుకు పోయింది. పెరుగుతున్న ఉల్లి, టమాటా ధరల నియంత్రణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించడం లేదు. ఉల్లి, టమోటాతో పాటు ఇతర నిత్యావసరాలను రాయితీపై రైతు బజార్లలో అందించాలని, బ్లాక్ మార్కెట్‌పై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

తగ్గే అవకాశం లేదు..



రాష్ట్రంలో టమాటా ఎక్కువగా పండించే చిత్తూరు జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట తీవ్రంగా దెబ్బతింది. ప్రస్తుతం మార్కెట్ అవసరాలకు కర్ణాటక నుంచి టమాటాను దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనివల్ల రవాణా, హమాలీ, తరుగు ఖర్చులు భారీగా పెరిగిపోవడం టమాటా ధరల పెరుగుదలకు కారణమైంది.

– తోరాటి సూరిబాబు, హోల్‌సేల్ వ్యాపారి, మడికి

కొద్దిగా కొనుగోలు చేసుకుని..



టమాటా ధర ఒక్కసారిగా పెరగడంతో కొనుగోలు చేసే వారి సంఖ్య అమాంతం తగ్గిపోయింది. హోల్‌సేల్ వ్యాపారుల వద్ద బాక్సులతో కొనుగోలు చేస్తున్న టమాటా ఎక్కువ రోజులు నిల్వ ఉండే అవకాశం లేక కుళ్లిపోయి తీవ్ర నష్టం మిగులుతుంది. అందుకే టమాటాలను కొద్ది కొద్దిగా మాత్రమే కొనుగోలు చేసుకుని విక్రయిస్తున్నాం.

– ఆదినారాయణ, వ్యాపారి, ఆలమూరు

వరద బాధితులకు రూ.1.40 లక్షల సాయం



మంత్రి సుభాష్‌కు విరాళం డీడీని అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

రామచంద్రపురం: మండల ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సభ్యులు విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి రూ.1.40 లక్షల సాయం అందించారు. సాయంతాలూకు డీడీలను ద్రాక్షారామ పంచాయతీ కార్యాలయంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు ఇచ్చారు. ఈ విరాళాన్ని అందజేసిన అసోసియేషన్ సభ్యులను మంత్రి అభినందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు సత్తిబాబు, నియోజకవర్గ అధ్యక్షుడు గుబ్బల రాము, నాయకులు విజయ్, మల్లికార్జునరావు, గిరీష్ ప్రభు, సబీనా, సాయి భరద్వాజ్, బుజ్జీ తదితరులు పాల్గొన్నారు

నేటి నుంచి అంతర్ జిల్లాల హ్యాండ్‌బాల్ టోర్నమెంట్

రాజానగరం: దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో ఏపీ పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యంలో 68వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ హ్యాండ్ బాల్ టోర్నమెంట్ సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రారంభం కానుంది. మూడు రోజులపాటు జరిగే ఈ పోటీలు బాలుర అండర్– 17 కేటగిరీలో జరుగుతాయని పాఠశాల క్రీడా సమాఖ్య, జిల్లా చైర్మన్, కలెక్టర్ పి. ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు కందుల దుర్గేష్, ఎంపీలు దగ్గుబాటి పురందేశ్వరి, తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొంటారన్నారు.

దుర్గంధం భరించలేకపోతున్నామని ఆందోళన

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డి పంచాయతీ పరిధిలో నిర్మించిన అస్సాగో ఇథనాల్ ఫ్యాక్టరీ వద్ద గుమ్మళ్లదొడ్డి, బావాజీపేటకు చెందిన ప్రజలు ఆందోళనకు దిగారు. ఫ్యాక్టరీ నుంచి దుర్వాసన వస్తుండటంతో శనివారం రాత్రి నుంచి నిరసన తెలిపారు. వారం రోజుల క్రితం ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పరిశ్రమను సందర్శించగా, యాజమాన్యం 20 రోజుల్లో దుర్వాసన రాకుండా చర్యలు చేపతామని హామీ ఇచ్చింది. రెండు రోజులుగా తీవ్రమైన దుర్గంధం వెదజల్లుతుందని, దీనివల్ల వాంతులు అయ్యి, రోగాల బారిన పడుతున్నామని తక్షణమే పరిశ్రమను నిలిపివేయాలని పలువురు పరిశ్రమ ఎదుట ఆందోళన చేపట్టారు. ఉదయం ఇరు గ్రామాలకు చెందిన భారీ ఎత్తున మహిళలు అక్కడకు చేరుకున్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో ఉండాల్సిన కాలుష్య పరిశ్రమను గ్రామాల మధ్య ఏర్పాటు చేయడం సరికాదని అన్నారు. ఈ విషయం తెలుసుకున్న గోకవరం ఎస్సై పవన్‌కుమార్, కోరుకొండ, రాజమహేంద్రవరం నుంచి పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అలాగే యాజమాన్యంతో పోలీసులు చర్చలు జరిపారు. పది రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని పరిశ్రమ యాజమాన్యం లిఖిత పూర్వకంగా హామీ ఇవ్వడంతో ప్రజలు ఆందోళన విరమించారు.



అస్సాగో ఇథనాల్ ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తున్న ప్రజలు

అన్న చేతిలో తమ్ముడి హతం

- ఆస్తి వివాదాలే కారణం
- పి.మల్లవరంలో కలకలం



వెంటపల్లి నూకరాజు (ఫైల్)

తాళ్లరేవు: ఆస్తి తగాదాల నేపథ్యంలో అన్న చేతిలో తమ్ముడు హతమైన ఘటన పి.మల్లవరం గ్రామంలో కలకలం రేపింది. స్థానికులు, కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ కథనం మేరకు.. పి.మల్లవరం పెదపేట గ్రామానికి చెందిన వెంటపల్లి నూకరాజును అతని అన్న వెంటపల్లి ఏడుకొండలు కత్తితో నరికి చంపాడు. వీరిద్దరికీ ఇంటి, ఉమ్మడి ఆస్తి వివాదాలు ఉన్నాయి. అంతేకాకుండా కోర్టుల్లో సైతం కేసులు నడుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో నూకరాజు ఇంటి పెరట్లోని కొబ్బరి కాయలు తీయిస్తుండగా అన్నదమ్ముల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తీవ్ర ఆగ్రహానికి గురైన ఏడుకొండలు విచక్షణా రహితంగా కత్తితో దాడి చేయడంతో నూకరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనతో భీతావహులైన స్థానికులు అక్కడి నుంచి పరుగులు తీశారు. మృతుడు నూకరాజుకు భార్య నాగరత్నం, ఎనిమిదేళ్ల కుమారుడు సంతోష్ అభిరామ్, నాలుగేళ్ల కుమార్తె స్వరూప ఉన్నారు. పెద్ద దిక్కు మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చైతన్యకృష్ణ తెలిపారు.



నూకరాజు మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ చైతన్య కృష్ణ, ఎస్సై సత్యనారాయణ

మూడు నెలలు.. ముగ్గురి మృతి

ఇలా ఉండగా ఆ కుటుంబంలో మూడు నెలల వ్యవధిలో ముగ్గురు మృతి చెందడాన్ని కుటుంబీకులు జీర్ణించుకోలేక పోతున్నారు. కుటుంబ యజమాని వెంటపల్లి నాగభూషణం మూడు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా, అతని భార్య మిరియమ్మ గత నెలలో మృతి చెందింది. వారం రోజుల క్రితమే ఆమె మృతికి సంబంధించి సంస్మరణ దినాన్ని నిర్వహించారు. అది జరిగి వారం గడవకముందే ఆ కుటుంబంలో మరో వ్యక్తి మృతి చెందడం శోచనీయం.



దిక్కుతోచని స్థితిలో మృతుడి భార్య, పిల్లలు

టోల్ గేట్‌ను ఢీకొన్న లారీ



టోల్‌గేట్‌ను ఢీకొని బోల్తాపడిన లారీ

రావులపాలెం: మండలంలోని ఈతకోట జాతీయ రహదారిపై ఉన్న టోల్ గేట్‌ను శనివారం అర్ధరాత్రి ఒక లారీ ఢీకొట్టి బోల్తా పడింది. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు నుంచి కోడి గుడ్ల లోడుతో కోల్‌కతా వెళుతున్న లారీ స్థానిక టోల్‌గేట్ వద్దకు వచ్చేసరికి అక్కడ ఉన్న డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో టోల్‌గేట్ క్యాబిన్ ధ్వంసం కాగా, రూ.3 లక్షల వరకూ ఆస్తి నష్టం జరిగినట్లు మేనేజర్ కేవీవీఎస్ఎన్ రెడ్డి తెలిపారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదన్నారు.

కాలువలో మహిళ మృతదేహం



మహిళ మృతదేహం

ఆలమూరు: 216ఏ జాతీయ రహదారిలోని చొప్పెల్ల వద్ద తూర్పు డెల్టా ప్రధాన కాలువలో ఆదివారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. స్థానిక లాకుల వద్ద పైభాగంలో సుమారు 45 నుంచి 50 ఏళ్ల మధ్య వయసు ఉన్న మహిళ మృతదేహం పొదల్లో చిక్కుకుని నిలిచిపోయింది. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై ఎం.అశోక్, తన సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. దేవీ నవరాత్ర మహోత్సవాలను పురస్కరించుకుని వేమగిరి, బుర్రిలంక, కడియపులంక, పొట్టిలంక తదితర ప్రాంతాల్లోని రేవుల వద్ద స్నానం చేస్తూ ప్రమాదవశాత్తు జారిపడి ఉంటుందని స్థానికులు భావిస్తున్నారు. ఈ మేరకు ఎస్సై అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

తొండంగి: మండలంలోని ఒంటిమామిడిలో ఆదివారం ఉదయం బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. గోర్సపాలెం గ్రామానికి చెందిన నేమాల ఉప్మాక (53) తాను సాగు చేస్తున్న పొలానికి పురుగు మందు పిచికారీ చేసేందుకు స్ప్రేయర్ కోసం ఒంటిమామిడి వచ్చాడు. అక్కడ లేకపోవడంతో తొండంగి వెళ్లేందుకు బైకుపై బయలు దేరాడు. ఒంటిమామిడి పోలీస్ స్టేషన్‌కు సమీపంలో వెనుక నుంచి లారీ వచ్చి బైక్‌ను బలంగా ఢీకొంది. లారీ కింద పడిన ఉప్మాక పడి నుజ్జువ్వడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య కొండమ్మ, కుమార్తెలు మంగ, రమణమ్మ, కుమారుడు స్వామి ఉన్నారు. మృతుడు తన పొలాన్ని సాగుచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. ఈ ప్రమాదంలో అతను మృతి చెందడంతో పెద్ద దిక్కును కోల్పోయామని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఒంటిమామిడిలో ప్రమాద స్థలం వద్ద రోదిస్తున్న మృతుని కుటుంబ సభ్యులు

దేశ కీర్తి ప్రతిష్టలను పెంచాలి

ముగిసిన సీబీఎస్ఈ వాలీబాల్ పోటీలు

రాజానగరం: క్లస్టర్ లెవెల్‌లో ఆడి, విజేతలుగా నేడు బహుమతులు అందుకుంటున్న మీరంతా రాబోయే కాలంలో దేశం తరపున అంతర్జాతీయ స్థాయిలో ఆడి, దేశ కీర్తి ప్రతిష్టలను పెంపొందించే విధంగా ఎదగాలని ఐటీ రంగ నిపుణులు వినోద్‌వర్మ ఆకాంక్షను వెలిబుచ్చారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో నాలుగు రోజులుగా జరుగుతున్న సీబీఎస్ఈ క్లస్టర్ ఏడు వాలీబాల్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ పోటీలలో ప్రథమ స్థానంలో నిలిచినవారు హిమాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటారు. ఈ సందర్భంగా జరిగిన ముగింపు సభలో విజేతలకు ముఖ్యఅతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ పోటీలలో గెలుపు, ఓటములు సహజమని, ఓటమితో కుంగిపోకుండా నిరంతర సాధన ద్వారానే విజేతలుగా నిలుస్తారన్నారు. తెలంగాణ రాష్ట్రాలలోని 110 సీబీఎస్ఈ స్కూల్స్ నుంచి 1,400 క్రీడాకారులు, 150 మంది కోచ్‌లు, మేనేజర్లు ఈ పోటీలకు హాజరయ్యారు. కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వై.వెంకట్, రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయుడు సిరా గంగాధర్, సీబీఎస్ఈ క్రీడల పరిశీలకులు కిషోర్‌కుమార్ (ఎస్‌కేవీటీ కళాశాల), ప్రిన్సిపాల్ విమల, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, మేనేజర్ ఎస్ఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.



అండర్ 19లో ప్రథమ స్థానాన్ని పొందిన హీల్ స్కూల్ (విజయవాడ) టీమ్

విజేతలు వీరే..

అండర్ – 14, అండర్ –17, అండర్ – 19 విభాగాలలో విజేతలు అండర్ 14లో ప్రథమ స్థానాన్ని శ్రీప్రకాష్ విద్యానికేతన్ (పాయకరావుపేట), ద్వితీయ స్థానాన్ని ఫార్చ్యూన్ బటర్‌ఫ్లై స్కూల్ (రంగారెడ్డి), తృతీయ స్థానాలను హీల్ స్కూల్ (విజయవాడ), శ్రీభానోదయ స్కూల్ (చిత్తూరు) నిలిచాయి. అండర్ 17 లో ఫార్చ్యూన్ బటర్‌ఫ్లై స్కూల్ (రంగారెడ్డి), గోర్కీ స్కూల్ (తెలంగాణ) మొదటి రెండు స్థానాలను పొందగా మూడో స్థానంలో ప్రగతి సెంట్రల్ (హైదరాబాద్), ఢిల్లీ పబ్లిక్ స్కూల్ (నాచారం) నిలిచాయి. అండర్ 19లో హీల్ స్కూల్ (విజయవాడ) ప్రథమ, అక్షర విద్యాలయం (నెల్లూరు) ద్వితీయ, ఫార్చ్యూన్ బటర్‌ఫ్లై స్కూల్ (రంగారెడ్డి), ఎక్సిలేన్షియా స్కూల్ (హైదరాబాద్) తృతీయ స్థానాలలో నిలిచాయి.

చిత్రలేఖన ఉపాధ్యాయులకు సత్కారం



సత్కారం పొందిన చిత్రలేఖన ఉపాధ్యాయులు

అమలాపురం టౌన్: స్థానిక ప్రెస్‌క్లబ్ భవనంలో ప్రపంచ గురు పూజోత్సవం సందర్భంగా కోనసీమ కళా పీఠం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా హాజరైన 75 మంది చిత్రలేఖన ఉపాధ్యాయులకు ఆదివారం రాత్రి సత్కారాలు జరిగాయి. పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు ఉంద్రు ఆశీర్వాదం ఆధ్వర్యంలో జరిగిన ఈ సత్కార సభకు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ముఖ్య అతిథిగా పాల్గొని చిత్రలేఖన ఉపాధ్యాయులను సత్కరించారు. తరగతి గదుల్లో విద్యార్థులకు చిత్ర లేఖనం పట్ల మెళకువలు నేర్పుతూనే లోలోపల తమ కుంచెలతో చిత్రలేఖనాన్ని ఉపాధ్యాయులు ఓ లోకంగా భావిస్తారని ఎమ్మెల్యే ఆనందరావు అన్నారు. ప్రముఖ చిత్రకారులు ఎస్ఎస్ శర్మ, ఆకొండి అంజి, కార్టూనిస్ట్ మాడా రాము, కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ, చిత్రలేఖన ఉపాధ్యాయులు సాదా రామకృష్ణ, బత్తుల శ్రీను, గిడ్డ శ్రీను, నాగారపు సత్యనారాయణ, శారదాదేవి తదితరులు పాల్గొన్నారు. చివరిగా ఒకే వేదికపై నిర్వాహకుడు, చిత్రకారుడు ఆశీర్వాదాన్ని సత్కరించారు.

ముగిసిన అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు



ఏపీ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో విజేతగా నిలిచిన విశాఖపట్నం జట్టు

ప్రకాశంనగర్ (రాజమహేంద్రవరం): ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న ఈ పోటీల్లో విశాఖపట్నం జట్టు విజేతగా నిలిచింది. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్–14, 16, 18, 20 విభాగాల్లో మొత్తం మూడు రోజుల పాటు పోటీలు జరిగాయి. సుమారు 17 జిల్లాల నుంచి 1,300 మంది క్రీడాకారులు, కోచ్‌లు హాజరయ్యారు. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో విశాఖపట్నం బాలుర విభాగం జట్టు 136 పాయింట్లు సాధించగా, బాలికల విభాగంలో 122 పాయింట్లు సాధించి మొత్తం 258 పాయింట్లతో విశాఖపట్నం జట్టు ఓవరాల్ చాంపియన్ షిప్‌ను గెలుచుకుంది. విజేతలు ఈ నెల 16, 17, 18వ తేదీల్లో గుంటూరులో జరిగే సౌత్ జోన్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌కు అర్హత సాధించారని నిర్వాహకులు తెలిపారు. ఈ ఏర్పాట్లను ఆకుల హైమావతి, అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.రాజేంద్ర, కార్యనిర్వాహక కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, కార్యదర్శి ఎస్.శివకుమార్ తదితరులు పర్యవేక్షించారు.

యువకుడి మృతదేహం లభ్యం

తుని రూరల్: తుని మండలం ఎస్.అన్నవరం శివారు ద్వారకానగర్ నిర్మానుష్య ప్రదేశంలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. ఆదివారం రాత్రి స్థానికుల నుంచి అందిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించినట్టు రూరల్ ఎస్సై బి.కృష్ణామాచారి తెలిపారు. 25 నుంచి 30 ఏళ్ల వయసుగల యువకుడు మృతిచెంది రెండు రోజులవుతుందన్నారు. గుర్తుపట్టలేని విధంగా ఉన్న మృతదేహంపై నలుపు రంగులో ఉన్న ప్యాంటు, షర్టులు ఉన్నాయన్నారు. కుడి చేయి మణికట్టుకు బ్యాండ్ ధరించి ఉన్నాడన్నారు.